జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 10-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 724 పేజీలు: 4 వెల: రూ.7

☀ విజిలెన్స్ విచారణలో వెలుగు చూసిన భారీ అవినీతి లీలలు ☀ కాంట్రాక్టరుకు కాసుల వర్షం.. ☀ ఖజానాకు భారీ గండి ☀ పే అండ్ అకౌంట్స్ అధికారుల నిర్వాకం గుట్టురట్టు ☀ విచారణకు ప్రభుత్వం ఆదేశం ☀ దోషులపై అభియోగ పత్రాలు జారీ ☀ ఏడుగురు అధికారుల అవినీతి బట్టబయలు ☀ కాంట్రాక్టరుకు కాసుల వర్షం కురిపించిన ఘనులు ☀ ఐదుగురు ఇంజనీర్లపై ఉమ్మడి విచారణ ☀ విశ్రాంత పీఏఓలిద్దరిపై రూల్-9 కింద ప్రత్యేక కొరడా ☀ అభియోగ పత్రాలు జారీ చేసిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్



## వంశధార - బహుదా అనుసంధానంలో..

# అడ్డగోలుగా లూటీ!

శ్రీకాకుళం, జులై 9 (వార్త): ఉత్తరాంధ్ర సాగునీటి రంగానికి తలమానికంగా భావించిన "వంశధార - బహుదా నదుల అనుసంధానం" ప్రాజెక్టు ఇన్వెస్టి గేషన్ పనులలో చోటుచేసుకున్న పక్కా అవినీతి గుట్టురట్టయింది. నిబంధనలను తుంగలో తొక్కి, ఉన్నతాధికారుల ఆమోద ముద్ర లేకపోయినా.. కాంట్రాక్టరు ప్రయోజనమే పరమావధిగా ప్రజా ధనాన్ని దోచిపెట్టిన అప్పటి జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఆర్థిక శాఖ సిబ్బంది ఉమ్మడి భాగస్వామ్యం బట్టబయలైంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం లోతుగా జరిపిన దర్యాప్తులో ఈ అవినీతి లీలల నగ్నసత్యాలు వెలుగుచూడటంతో, ప్రభుత్వం తీవ్రస్థాయిలో స్పందించింది. ఈ ఘోర అక్రమాలకు బాధ్యులైన ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులు, ఇద్దరు పే అండ్ అకౌంట్స్ అధికారులతో కూడిన మొత్తం ఏడుగురు గ్యాంగుపై కఠిన విచారణకు ఆదేశిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

### నిబంధనలు బేఖాతర్..

### కాంట్రాక్టరుకు 'ఉదారత'

హిరమండలం రిజర్వాయర్ నుంచి వంశధార నదిని దాటుకుంటూ కవిటి, కంచిలి, సోంపేట, మందస, ఇచ్ఛాపురం మండలాల ఆయకట్టుకు నీరందించేందుకు హైలెవెల్ కెనాల్ వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారీ పనులను రూ. 499.84 లక్షల అంచనాతో మెస్సర్స్ కాంటెక్ డిజైన్ అండ్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. ఒప్పంద నిబంధనల ప్రకారం.. కెనాల్ అలైన్‌మెంట్, హైడ్రాలిక్ వివరాలు సమర్పించి నప్పుడు 75 శాతం నిధులను మాత్రమే విడుదల చేయాలి. మిగిలిన 25 శాతం నిలిపివేసిన మొత్తాన్ని సదరు పనులకు సంబంధిత ఉన్నతాధికారి నుంచి పూర్తిస్థాయి ఆమోదం పొందిన తర్వాతే చెల్లించాలనే కచ్చితమైన నిబంధన ఉంది. కానీ, ఎటువంటి అనుమతులు లేకపోయినా ఎల్.ఎస్. 1, 2, 3 పార్ట్ బిల్లుల ద్వారా రూ. 1.60 కోట్లకు పైగా నిధులను కాంట్రాక్టరు ఖాతాలోకి యథేచ్ఛగా మళ్లించేశారు.

### అవినీతి చక్రంలోని.. సూత్రధారులు.. పాత్రధారులు వీరే..

ఈ భారీ నిధుల మళ్లింపు వ్యవహారంలో క్షేత్రస్థాయి నుంచి బిల్లులు పాస్ చేసే ఆర్థిక శాఖ కార్యాలయం వరకు ఎవరెవరు ఏ విధంగా చేతులు కలిపారో విజిలెన్స్ నివేదిక స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం ఏడుగురు అధికారులు: ఎం. సురేంద్ర రెడ్డి (అప్పటి సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.ఆర్.ఆర్ వంశధార ప్రాజెక్ట్ సర్కిల్) దర్యాప్తు పనుల ఒప్పంద నిబంధనలను పక్కనబెట్టి అలైన్‌మెంట్‌కు ఆమోదం రాకుండానే బిల్లులను పీఏఓ కార్యాలయానికి సిఫార్సు చేసిన ప్రధాన బాధ్యత ఈయనదేనని తేలింది. ఎ. రామకృష్ణ (అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ) బి.ఆర్.ఆర్ వంశధార ప్రాజెక్ట్, సబ్ డివిజన్ నంబర్-4, శ్రీకాకుళం. క్షేత్రస్థాయిలో నిబంధనల ఉల్లంఘనకు అడ్డులేకుండా ఫైళ్లను నడిపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

### మరో ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులు..

పనుల పురోగతిని, నిబంధనలను సరిచూడకుండానే బిల్లులను రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపిన జలవనరుల శాఖకు చెందిన మరో ముగ్గురు అధికారులు.

(ఈ ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులపై ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్-1991 లోని రూల్-24 ప్రకారం ప్రభుత్వం 'ఉమ్మడి విచారణ' జరుపుతోంది). పి. నాగేశ్వరరావు (అప్పటి పే అండ్ అకౌంట్స్ అధికారి ) సరైన స్క్రూటినీ చేయకుండా, ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తూ కాంట్రాక్టరుకు 25% నిలిపివేసిన సొమ్మును విడుదల చేయడంలో కీలక పాత్ర పోషించారు. డి. శ్రీనివాసరెడ్డి (అప్పటి పేఈ అండ్ అకౌంట్స్ అధికారి) ఈయన కూడా పీఏఓగా వ్యవహరించిన కాలంలో నిబంధనల ఉల్లంఘన బిల్లులను గుడ్డిగా ఆమోదించి కాంట్రాక్టరుకు అయాచిత లబ్ధి చేకూర్చారు.

### పెన్షన్లకూ గండి.. పీఏఓలపై ప్రత్యేక కొరడా!

ఈ అక్రమాల్లో పాల్గొన్న ఏడుగురిపై గతంలో 13-11-2025 నాడు ఉమ్మడి విచారణ జీవో ఇచ్చినప్పటికీ, తాజా పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. పీఏఓలుగా పనిచేసిన పి.నాగేశ్వరరావు, డి. శ్రీనివాసరెడ్డిలు ఇద్దరూ ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందారు. విశ్రాంత ఉద్యోగులపై ఉమ్మడి విచారణ కాకుండా పెన్షన్ నియమావళి ప్రకారం విడిగా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తాజాగా జులై 9, 2026న సంచలన ఉత్తర్వులు జారీ చేశారు. పాత ఉమ్మడి విచారణ ఉత్తర్వుల నుంచి వీరిద్దరి పేర్లను తొలగిస్తూ సవరణ జీవో విడుదల చేశారు. గతంలో వీరికి జారీ చేసిన పాత చార్జ్ మెమోలను పూర్తిగా రద్దు చేశారు. వీరిద్దరూ విశ్రాంత ఉద్యోగులు అయినందున ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్-1980 లోని రూల్ 9 ప్రకారం కఠినమైన శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ ప్రత్యేకంగా జీవో. నం 27 (శ్రీనివాసరెడ్డిపై), జీవో. నం 28 (నాగేశ్వరరావుపై) జారీ చేశారు. ఈ మేరకు ఇద్దరు విశ్రాంత పీఏఓలకు కొత్తగా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ (అభియోగ పత్రాలు) జారీ చేస్తూ, 10 రోజుల్లోగా రాతపూర్వక సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. తాజా సర్కారు నిర్ణయంతో అటు ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులపై ఉమ్మడి విచారణ వేగవంతం కాగా, ఇటు విశ్రాంత పీఏఓలిద్దరికీ పెన్షన్ ప్రయోజనాలు నిలిచిపోయేలా కఠిన ఉచ్చు బిగిసింది. ప్రజాధనాన్ని లూటీ చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రభుత్వం జారీ చేసిన ఈ వరుస జీవోలు స్పష్టం చేస్తున్నాయి.



## ఉద్యోగుల హక్కుల సాధనకే..

# సిక్కోలు గర్జన

✳ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గట్టి హెచ్చరికగా ఉద్యోగుల ఐక్య గళం వినిపిద్దాం ✳ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు ✳ చర్చలకు సిద్ధమని చెప్పినా స్పందించడం లేదు ✳ ఇక మౌనం వీడి ఉద్యమబాట పట్టాల్సిందే ✳ భవిష్యత్ పోరాటాలకు ఇది కీలక వేదిక ✳ ప్రభుత్వం స్పందించే వరకూ దశలవారీగా ఉద్యమం ✳ సిక్కోలు గర్జనను విజయవంతం చేయండి ✳ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ✳ 12న అంబేద్కర్ ఆడిటోరియంలో ఏపీ జేఏసీ అమరావతి సన్నద్ధ సభ ✳ పోస్టర్ ఆవిష్కరించిన జేఏసీ ప్రతినిధులు

శ్రీకాకుళం, జులై 9 (వార్త):రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం ఇప్పటికీ పరిష్కారం చూపకపోవడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేదీన శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో "సన్నద్ధం సభ-సిక్కోలు గర్జన" పేరుతో సమావేశం నిర్వహించనున్నామన్నారు. గురువారం శ్రీకాకుళం నగరంలో సిక్కోలు గర్జనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన హక్కులు, చట్టబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం వరుసగా విస్మరిస్తోందని విమర్శించారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా, చర్చలకు సిద్ధమని తెలిపినా ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఇక మౌనం వీడి ఉద్యమ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల ఐక్యతను చాటే కార్యక్రమాల్లో భాగంగానే శ్రీకాకుళంలో "సిక్కోలు గర్జన" సన్నద్ధ సభను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభ ఉద్యమ కార్యాచరణకు నాంది పలుకుతుందని, ఉద్యోగుల హక్కుల సాధన కోసం భవిష్యత్ పోరాటాలకు ఇది కీలక వేదిక కానుందని వివరించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో పెండింగ్ పీఆర్‌సీ బకాయిల తక్షణ చెల్లింపు, డీఏ బకాయిల విడుదల, ఐఆర్ బకాయిల చెల్లింపు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు, 11వ పీఆర్‌సీ ఏర్పాటు, జీపీఎఫ్ సమస్యల పరిష్కారం, ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, 2010 డీఎస్సీ అభ్యర్థులకు టెట్ మినహాయింపు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల వేతనాల పెంపు, ఈహెచ్ఎస్‌ను సమర్థంగా అమలు చేయడం, మున్సిపల్ తదితర శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారం వంటి మొత్తం 21 ప్రధాన డిమాండ్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ డిమాండ్లన్నీ ఉద్యోగుల హక్కులకు సంబంధించినవేనని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలను విస్మరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడం తప్ప మరో మార్గం ఉండదని స్పష్టం చేశారు. సన్నద్ధ సభలో ఉద్యమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకు దశలవారీ ఆందోళనలు చేపడతామని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల ఐక్య శక్తిని చాటే కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు కుటుంబ సమేతంగా భారీ సంఖ్యలో హాజరై సిక్కోలు గర్జనను విజయవంతం చేసి ప్రభుత్వానికి ఉద్యోగుల ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఫణి పేర్రాజు, బివివిఎన్ రాజు జిల్లా చైర్మన్, ప్రధాన కార్యదర్శి ఎస్వి రమణ, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.






# జగన్‌ను రెండోసారి సీఎం చేస్తాం

- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో బొత్స పాత్ర చిరస్మరణీయం
- పార్టీకి వెన్నెముకగా ఆయన సేవలు
- బొత్స జన్మదిన వేడుకల్లో డాక్టర్ అప్పలరాజు స్పష్టీకరణ



**పలాస, జులై 9 (వార్త):** రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు గురువారం పలాస నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పలాసకు చెందిన రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నేతృత్వంలో నియోజకవర్గంలోని కీలక నేతలు, వివిధ స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి బొత్స సత్యనారాయణని కలిశారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ బొత్స సత్యనారాయణ నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాజీవితంలో అనుభవం ఉన్న నాయకుడని పేర్కొన్నారు. మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా, పీసీ అధ్యక్షుడిగా, మంత్రి మండలిలో కీలక శాఖలను నిర్వహించి రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషి విశేషమన్నారు. విశాఖపట్నం జిల్లా అభివృద్ధికి బొత్స సత్యనారాయణ చేసిన సేవలు అందరికీ తెలిసినవేనని అప్పలరాజు తెలిపారు. ఉత్తరాంధ్రలో పరిశ్రమల స్థాపన, విద్యా సంస్థల ఏర్పాటు, జాతీయ రహదారుల విస్తరణ, ఓడరేవుల అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమని చెప్పారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో బొత్స కృషి చిరస్మరణీయమన్నారు. వైఎస్ఆర్సిపి పార్టీలో బొత్స సత్యనారాయణ ట్రబుల్ షూటర్ గా గుర్తింపు పొందారని అప్పలరాజు అన్నారు. పార్టీలో ఏదైనా సమస్య వచ్చినా, నేతల మధ్య విభేదాలు తలెత్తినా వాటిని చాకచక్యంగా పరిష్కరించి పార్టీని ఏకతాటిపైకి తెచ్చే సత్తా ఆయనకు ఉందని పేర్కొన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డ ఆశయాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో బొత్స కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వచ్చే 2029 సాధారణ ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని డాక్టర్ అప్పలరాజు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు బొత్స సత్యనారాయణ నాయకత్వంలో అందరం క్రమశిక్షణతో పని చేస్తామన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరేస్తామని వెల్లడించారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, వైఎస్ఆర్సిపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, పలాస మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వర రావు, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, వైఎస్ఆర్సిపి జిల్లా యువజన నేత సేనాపతి కిషోర్, వైఎస్ఆర్సిపి పలాస రూరల్ మండల అధ్యక్షులు దువ్వాడ రవితో పాటు మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వివిధ సెల్ ల నేతలు, కార్యకర్తలు పాల్గొని బొత్స సత్యనారాయణకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీకాకుళం

## ఆపదలో అండగా సీఎం సహాయనిధి



**జి.సిగడాం, జులై 9(వార్త):** పేదవారికి సీఎం సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే కుమారుడు నడుకుదిటి తేజా బాబు అన్నారు. గురువారం ఎమ్మెల్యే నడు కుదిటి ఈశ్వరరావు అదేశాల మేరుకు ప్రమాదవశాత్తు అనారోగ్యంకి గురైన అద్వానం పేట గ్రామానికి చెందిన బాలి గోవిందనకు రూ. 78,262 జి.సిగడాం గ్రామానికి చెందిన అల్లాడ క్రిష్ణ రూ. 52,240 సీఎం సహాయనిధి చెక్కులను స్వయంగా యువనాయకులు తేజా బాబు వారి ఇంటికి వెళ్లి విలువైన సీఎం సహానిది చెక్కులను పంపిణీ చేశారు. దీనిపై తేజా బాబుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆపద సమయాల్లో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి పార్టీ అధ్యక్షులు కుమరాపు రవి కుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవి కుమార్, ఎంపీసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకటరమణ, జిల్లా జనసేన నాయకులు భూపతి అర్జున్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు, నక్క మురళీ, నాయకులు విక్రం, మానం సత్యరావు, విక్రం కాశీ, పడాల అప్పన్న మక్క నారాయణరావు, డోల పార్వతీ పాల్గొన్నారు.



## ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ



**జి.సిగడాం, జులై 9(వార్త):** మర్రివలస పంచాయతీ మానంపేట గ్రామంలో గురువారం వేద పండితుల నడుమ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు యువ నాయకుడు నడుకుదిటి తేజా బాబు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పాడిపంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని సీతారాముల స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమం కూటమి మండల పార్టీ అధ్యక్షులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, స్థానిక నాయకులు మానం సత్యారావు, విక్రం సత్యారావు, మాజీ సర్పంచ్ విక్రం కోటిబాబు, విక్రం కాశీ, పిఎసిఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాధరావు, నక్కమురళీ, జిల్లా జనసేన నాయకులు భూపతి అర్జున్ కుమార్, నాయకులు పడాల అప్పన్న, పలిశెట్టి సూర్యనారాయణ, చిత్తిరి తిరుపతిరావు, మక్క నారాయణరావు, డోల పార్వతీ, తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం




**పలాస, జులై 9 (వార్త):** పెంటిభద్ర (కాశీబుగ్గ)లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ , విద్యుత్ లైన్ల మరమ్మతులు శనివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయం అనంతపురం, పెంటిభద్ర, జయరాంచంద్రపురం, పద్మనాభపురం, తాలభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వే గేట్ డౌన్, పెసరపాడు, చినబాడాం, అంతరకుడ్డ, రాజపురం, ఓల్డ్ ఎన్‌హెచ్-5 రోడ్, కేటీ రోడ్ ప్రాంతాలతో పాటు కొంత సమయం పాటు శ్రీనివాసనగర్, ఎండీవో కార్యాలయం పరిసరాలు, రోటరీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాపై ప్రభావం చూపుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

## మందస మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షునిగా రుషేశ్వరరావు

**మందస, జులై 9(వార్త):** ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మందస(పూర్వపు )సమితి సంఘ ఎన్నికలు గురువారం మందస మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పి.నాగేశ్వరరావు కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు.-అధ్యక్షునిగా బి.రుషేశ్వరరావు, ఉపాధ్యక్షురాలిగా బి.జ్యోష్న, కార్యదర్శిగా ఎన్.కె.టి. శర్మ, సహాయ కార్యదర్శిగా ఎం.కామేశ్వరి, కోశాధికారిగా జి.గిరిధరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్.వి.రమణ, ఎస్.ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు రుషేశ్వరరావు తెలిపారు.



## “కళింగ సీమ గర్జిస్తోంది... చరిత్రను తిరిగి రాస్తాం!”

- నేడు శ్రీకాకుళంలో చారిత్రాత్మక కళింగసీమ సదస్సు
- రాజ్యాధికారం పోయినా గుర్తింపు కోల్పోలేదు
- మేధావులు, జర్నలిస్టులతో కళింగ ఐక్యతకు పిలుపు



**పలాస, జులై 9 (వార్త):** మసకబారిన కళింగసీమ చరిత్రకు మళ్లీ వెలుగులు నింపే ఉద్దేశంతో కళింగసీమ మేధావులు, జర్నలిస్టులు, చరిత్రాభిమానులు ఒకే వేదికపైకి వస్తున్నారని, కళింగసీమ చరిత్రను తిరిగి ప్రజల ముందుకు తీసుకువచ్చే సంకల్పంతో శుక్రవారం శ్రీకాకుళంలో చారిత్రాత్మక కళింగసీమ సదస్సును ప్రముఖ డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అరసవల్లి రోడ్ లోని సన్ రైజ్ హోటల్ లో జరిగే ఈ సదస్సుకు ప్రముఖ వైద్యులు డా. దువ్వాడ జీవితేశ్వరావు ఆధ్వర్యంలో సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ వైస్ ఛాన్సలర్, మాజీ యుపిఎస్సి కమిషన్ సభ్యులు కె.ఎస్. చలం ముఖ్య అతిథిగా, ప్రముఖ కవి, రచయిత, సామాజికవేత్త అట్టాడ అప్పలనాయుడు గౌరవ అతిథిగా హాజరు కానున్నారు. సదస్సులో కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్, సమ్మ రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాలరావు, ప్రఖ్యాత కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ సన్నశెట్టి రాజశేఖర్ తో పాటు ఏపీజేఫ్, ఐ ఎఫ్ డబ్ల్యూజె, ఏపీఎంఫ్, ఏపిడబ్ల్యూజే, ఐజెయు తదితర జర్నలిస్టు సంఘాల రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొంటారని వెల్లడించారు. 1953లో మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయిన అనంతరం కళింగసీమ కోల్పోయిన గుర్తింపు, గౌరవం, అభివృద్ధి అవకాశాలపై విశ్లేషణ, మహామేఘవాహన ఖారవేల చక్రవర్తి నుంచి బొబ్బిలి రాజా రామకృష్ణ రంగారావు వరకు కళింగసీమ చరిత్ర, సంస్కృతి, వారసత్వ వైభవం, నేటి కళింగసీమ ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ, రాబోయే తరాలకు కళింగసీమ చరిత్రను చేరవేసే కార్యాచరణపై సదస్సులో లోతైన చర్చ జరుగుతుంది. ఈ చారిత్రాత్మక సదస్సుకు కళింగసీమ జర్నలిస్టులు, మేధావులు, చరిత్రాభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

### మార్కెట్ కమిటీ నిధులతో ..

## అభివృద్ధి పనులకు శ్రీకారం

- రోడ్లు, ప్రహరీ పనులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన
- రైతులకు మెరుగైన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి

**నరసన్నపేట, జులై 9 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మార్కెట్ కమిటీ నిధులను వినియోగిస్తున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం నరసన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ప్రాంగణంలో చేపట్టనున్న అంతర్గత సిమెంట్ రోడ్లు, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీ స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించడంతో పాటు రైతులు మార్కెట్ యార్డులో నిల్వ చేసే వ్యవసాయ ఉత్పత్తులకు భద్రత కల్పించే ఉద్దేశంతో ఆధునిక ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో కూడా రైతుల వాహనాలు, ట్రాక్టర్లు మార్కెట్ యార్డులోకి సులభంగా రాకపోకలు సాగించేలా నాణ్యమైన అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఆధునికీకరించి రైతులకు అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటూనే, మార్కెట్ యార్డుల్లో అవసరమైన సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. దళారీల వ్యవస్థను నియంత్రించి పారదర్శకమైన మార్కెటింగ్ వ్యవస్థను నెలకొల్పేందుకు మార్కెట్ కమిటీలను అన్ని విధాలా బలోపేతం చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతుల విస్తరణ కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి, నరసన్నపేట, పోలాకి వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి, నరసన్నపేట పీఏసీఎస్ చైర్మన్లు భైరి భాస్కరరావు, ఇసా అప్పారావు, జిల్లా పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఎల్ నినో, పంటల మార్పిడిపై అవగాహన

- కొండలోగాంలో గిరిజనులకు ప్రత్యేక సమావేశం



**మందస, జులై 9(వార్త):** జిల్లా వ్యవసాయశాఖ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఆత్మ పథకంలో భాగంగా గురువారం మందస మండలంలోని కొండలోగాం గ్రామంలో ఎల్ నినో ప్రభావం, పంటలమార్పిడిపై అవగాహనా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రైతు శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ వెంకటరావు, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. రవికృష్ణ, పలాస సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ వై.శారద, కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్, మండల వ్యవసాయధికారి జి.నాగరాజు, హార్టికల్చర్ ఆఫీసర్ సీహెచ్ శంకర్ దాసు, వ్యవసాయ విస్తరణాధికారి కె.జ్యోత్స్నలు మాట్లాడుతూ వరిలో అధిక దిగుబడులు పొందడానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులలో భాగంగా సమగ్ర కలుపు యాజమాన్యం, సమగ్ర ఎరువులు యాజమాన్యంపై రైతులకు శిక్షణ, అవగాహన కల్పించారు. అదేవిధంగా వరి, జీడి మామిడి, కొబ్బరి, ఆయిల్ ఫామ్ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులపై వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వ్యవసాయశాఖ ద్వారా ఇస్తున్నటువంటి పీఎండీఎస్ కిట్లను వినియోగించుకోవాలని రైతులను కోరారు. డ్రోన్ ద్వారా నానో ఎరువుల స్ప్రేయింగ్ చేసుకోవాలని రైతులకు సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడడంలో భాగంగా సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువులు ప్రాముఖ్యతను వివరిస్తూ రసాయన ఎరువులు వినియోగాన్ని తగ్గించుకోవాలని, మోతాదుకు మించి వాడకూడదని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ హార్టికల్చర్ అధికారి తులసిరావు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్




**పలాస, జులై 9 (వార్త):** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎసు) రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు నేటి నుంచి రెండో రోజులపాటు కాశీబుగ్గలోని టీకేఆర్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తామని, ఈ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని పి డి యస్ యు రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ లు పిలుపునిచ్చారు. గురువారం పలాస సూది కొండ కాలనీ పిడియస్ యు కార్యాలయంలో వారు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్నటువంటి మార్పులు, శాస్త్రీయ, లౌకిక, ప్రజాస్వామ్యక విలువల పరిరక్షణ కోసం విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించడానికి, ఉపాధి విద్య కొరకు ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతుల ప్రారంభ ఉపన్యాసానికి ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సురప్పడు, ఉన్నత విద్య, ఉపాధి సవాలు అనే అంశాన్ని బోధించడానికి అఖిల భారత విద్యా హక్కుల వేదిక నాయకులు రమేష్ పట్నాయక్, జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు అనే అంశాన్ని బోధించడానికి పి.ప్రసాద్, సామాజిక మార్పు విద్యార్థులు పాత్ర అనే అంశాన్ని బోధించడానికి సన్నశెట్టి రాజశేఖర్ ఏపీటీఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు తదితరులు హాజరవుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్య చరణ రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ విద్య వైజ్ఞానిక, శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, రాష్ట్ర నాయకులు ప్రసాద్, రమణ, శంకర్, జిల్లా నాయకులు విజయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## గొప్పిలి పాఠశాలలో శ్వేతనాగు కలకలం

**మెళియాపుట్టి, జులై 9(వార్త):** గొప్పిలి ప్రభుత్వోన్నత పాఠశాలలో గురువారం నాడు శ్వేతనాగు ప్రత్యక్షమవడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

ఇంటర్వెల్ సమయంలో విద్యార్థులు పాఠశాల ఆవరణలో సంచరిస్తుండగా, తెల్లని రంగులో కనిపించిన నాగుపాము పడగ విప్పి బుసలు కొడుతూ కనిపించింది. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు భయంతో పరుగులు తీసి తరగతి గదుల వైపు చేరుకున్నారు.

వెంటనే ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేయడంతో బయాలజీ ఉపాధ్యాయుడు జగన్నాధరావు అప్రమత్తమయ్యారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా చాకచక్యంగా వ్యవహరించి శ్వేతనాగును గోనెసంచిలో బంధించి దానిని సురక్షితంగా సుదూర అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఉపాధ్యాయుడు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారని పాఠశాల సిబ్బంది తెలిపారు. ఈ ఘటన అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఊపిరి పీల్చుకుని, ధైర్యంగా వ్యవహరించిన బయాలజీ ఉపాధ్యాయుడు జగన్నాధరావును అభినందించారు. ఈ ఘటనతో పాఠశాలలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, నాగుపామును సురక్షితంగా తరలించడంతో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# రాజుల చెరువులో మళ్లీ అక్రమ నిర్మాణం

- అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన ఆక్రమణదారులు
- చెరువును పరిరక్షించాలని స్థానికుల విజ్ఞప్తి



**నరసన్నపేట, జులై 9(వార్త):** నరసన్నపేటలోని రాజుల చెరువులో మరోసారి అక్రమ నిర్మాణం వెలసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా చెరువు పరిధిలో నిర్మాణం చేపట్టడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల క్రితం చెరువు పరిధిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గ్రామపంచాయతీ అధికారులు తొలగించారు. భవిష్యత్తులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, తాజాగా అదే ప్రాంతంలో మరోసారి నిర్మాణం పూర్తయినట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. చెరువులు ప్రజా ఆస్తులని, వాటిని ఆక్రమణల నుంచి కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికే తొలగించిన నిర్మాణాలు మళ్లీ వెలసిన నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమ కట్టడాన్ని తొలగించాలని, చెరువు భూములను పరిరక్షించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు పునరావృతం కాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రపంచ రికార్డు సాధించిన
## యువ శాస్త్రవేత్తకు ఘన సన్మానం

- డాక్టర్ మహేశ్వరం భాను చందర్‌ను అభినందించిన ఎమ్మెల్యే బగ్గు
- అత్యంత చిన్న విండ్ టర్బైన్ ఆవిష్కరణతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



**నరసన్నపేట, జులై 9 (వార్త):** నరసన్నపేట పట్టణానికి చెందిన యువ శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరం భాను చందర్ ప్రపంచస్థాయిలో అరుదైన గుర్తింపు సాధించడంతో ఆయనను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఘనంగా సన్మానించారు. ప్రపంచంలోనే అత్యంత చిన్న విండ్ టర్బైన్‌ను రూపొందించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడం నరసన్నపేట ప్రాంతానికి గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శాస్త్ర సాంకేతిక రంగంలో యువత ప్రతిభను ప్రపంచానికి చాటుతున్న డాక్టర్ భాను చందర్ సాధించిన విజయం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వినూత్న ఆవిష్కరణలతో దేశానికి, రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకొస్తున్న యువ శాస్త్రవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. డాక్టర్ భాను చందర్ రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత చిన్న విండ్ టర్బైన్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం విశేషమని, ఇలాంటి విజయాలు యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. డాక్టర్ భాను చందర్ మాట్లాడుతూ, తన పరిశోధనలకు కుటుంబ సభ్యులు, గురువులు, స్నేహితులతో పాటు స్థానిక ప్రజల ప్రోత్సాహం ఎంతో తోడ్పడిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వినూత్న ఆవిష్కరణలు చేసి దేశానికి పేరు తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి, నరసన్నపేట, పోలాకి వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పీఏసీఎస్ చైర్మన్లు భైరి భాస్కరరావు, ఇసా అప్పారావు, జిల్లా కార్యదర్శులు పూతి రమణ, యాగాటి లక్ష్మణరావు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ గొద్దు చిట్టిబాబు, మాజీ ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరాపు రామారావు, పుచ్చల కల్పన, బోయిన సతీష్, బలగ ప్రహర్ష, బతకల సంతోషి, సరిపల్లి మధు, చిట్టి సింహాచలం, దంత సింహాచలం, రావాడ గణపతిరావు, తాళాభక్తుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## పాడైన వంశధార ఎడమ కాలువ గట్లు

- కరకవలస-రాణ జంక్షన్ మధ్య 13 కి.మీ మేర దయనీయ పరిస్థితి
- వర్షాకాలానికి ముందే మరమ్మతులు చేపట్టాలని రైతుల విజ్ఞప్తి

**జలుమూరు, జులై 9(వార్త):** కరకవలస నుంచి రాణ జంక్షన్ వరకు సుమారు 13 కిలోమీటర్ల పొడవున ఉన్న వంశధార ఎడమ కాలువ గట్లు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కథనం ప్రకారం కాలువ గట్లు అనేక చోట్ల బలహీనంగా మారి, కుంగిపోయిన పరిస్థితిలో ఉన్నాయి. వర్షాకాలంలో కాలువలో నీటి ప్రవాహం పెరిగితే గట్లకు ఎప్పుడైనా గండి పడే ప్రమాదం ఉందని, దీంతో సాగునీటి సరఫరాతో పాటు పరిసర వ్యవసాయ భూములకు కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెబుతున్నారు. కాలువ గట్ల పరిస్థితిని అధికారులు పరిశీలించి, అత్యవసరంగా పటిష్టీకరణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రమాదాలు సంభవించిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తుగా మరమ్మతులు చేపట్టడం వల్ల రైతులు, ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే దెబ్బతిన్న గట్లను బలోపేతం చేసి, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాగునీటి కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని కోరుతున్నారు.



### జలుమూరులో విద్యార్థులకు ..
## ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలి

- కళాశాల విడిచి వెళ్లే వేళ తీవ్ర రద్దీ
- బస్సు ఎక్కడం ప్రాణాలతో చెలగాటమేనంటున్న విద్యార్థులు
- ఆర్టీసీ అధికారులు స్పందించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి



**జలుమూరు, జులై 9(వార్త):** జలుమూరులో కళాశాలలు విడిచిపెట్టే సమయాల్లో విద్యార్థులు బస్సుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రతిరోజూ జలుమూరు నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే విద్యార్థులు సాయంత్రం కళాశాలలు ముగిసిన అనంతరం బస్సు ఎక్కేందుకు తీవ్ర రద్దీని ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉండటంతో విద్యార్థులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం కళాశాలలకు వచ్చే సమయంలోనూ, సాయంత్రం తిరిగి స్వగ్రామాలకు వెళ్లే సమయంలోనూ సరిపడా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రద్దీ కారణంగా కొందరు ఫుట్‌బోర్డులపై ప్రయాణించాల్సి వస్తోందని, ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కళాశాలల ప్రారంభ, ముగింపు సమయాల్లో ప్రత్యేక స్టూడెంట్ బస్సులను నడపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. విద్యార్థుల అవసరాలను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### నిరుపయోగం..
## శ్రీముఖలింగం కళామండపం

- రూ. లక్షలతో నిర్మించిన వేదిక వినియోగానికి నోచుకోని పరిస్థితి
- సాంస్కృతిక కార్యక్రమాలకు అందుబాటులోకి తేవాలని భక్తుల విజ్ఞప్తి

**జలుమూరు, జులై 9(వార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కళామండపం ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో జరిగే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల కోసం నిర్మించిన ఈ వేదిక వినియోగంలో లేకపోవడంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుమారు రెండు దశాబ్దాల క్రితం మహాశివరాత్రి, కార్తీక మాసం వంటి ప్రధాన పర్వదినాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి సంగీత కచేరీలు, ఆధ్యాత్మిక సభల కోసం ఈ కళామండపాన్ని నిర్మించారు. అయితే గత కొంతకాలంగా ఈ వేదిక వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ఆలయానికి వస్తుండగా, కళామండపాన్ని వినియోగంలోకి తీసుకువస్తే సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకవర్గం స్పందించి కళామండపానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ ప్రాశస్త్యానికి తగిన విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.






## ఓటరు సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

- లింగాలవలస సచివాలయంలో బీఎల్‌వోతో కాంగ్రెస్ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ భేటీ
- నిజమైన ఓటర్ల పేర్లు తొలగించొద్దని సూచన



**జలుమూరు, జులై 9(వార్త):** రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితా సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ శుక్రవారం లింగాలవలస గ్రామ సచివాలయాన్ని సందర్శించి బీఎల్‌వోను కలిసి సర్వే ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోతో మాట్లాడిన ఆయన, ఓటరు సర్వేను పూర్తిగా పారదర్శకంగా, నిజాయితీగా నిర్వహించాలని సూచించారు. చనిపోయిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని పేర్కొన్నారు. అలాగే ఎలాంటి వివాదాలకు తావులేకుండా సర్వే నిర్వహించాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని గుర్తుంచుకోవాలని అన్నారు. అర్హులైన, నిజమైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటరు జాబితా నుంచి తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బీఎల్‌వో సానుకూలంగా స్పందిస్తూ నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటరు జాబితాను రూపొందిస్తున్నామని తెలిపారు. ఓటరు జాబితా ప్రక్రియ పారదర్శకంగా సాగి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మామిడి సత్యనారాయణ కోరారు.

### విద్యార్థులకు తప్పనిసరిగా
## హోమ్‌వర్క్ ఇవ్వాలి

- వర్క్‌బుక్‌లను పరిశీలించిన ఎంఈఓ మాధవరావు
- ఉపాధ్యాయులకు పలు సూచనలు




**జలుమూరు, జులై 9(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజూ తప్పనిసరిగా హోమ్‌వర్క్ అప్పగించి వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు సూచించారు. గురువారం జలుమూరు మండలం నగిరికటకం ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల బోధన, అభ్యాస ప్రక్రియను పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను తనిఖీ చేసి, హోమ్‌వర్క్ నిర్వహణ, పాఠ్యాంశాల బోధన, రాతపనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సురేష్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా హోమ్‌వర్క్ ఇవ్వడంతో పాటు, వర్క్‌బుక్‌లను క్రమం తప్పకుండా పరిశీలించి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేలా నాణ్యమైన బోధన అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థి అభ్యాస ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ బమ్మిడి మాధవరావు పేర్కొన్నారు.

## బీటలు వారిన బీసీ వసతి గృహం

- అధ్వాన స్థితిలో జలుమూరు హాస్టల్..
- విద్యార్థుల భద్రతపై ఆందోళన
- శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్

**జలుమూరు, జులై 9(వార్త):** జలుమూరులోని బీసీ వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, గోడలు బీటలు వారినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు నివసిస్తున్న భవనం దయనీయ స్థితిలో ఉండటంతో వారి భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం కాలక్రమేణా శిథిలమవగా, గోడలు పలు చోట్ల బీటలు వారాయని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. భవనానికి శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ, తాత్కాలికంగా చిన్నచిన్న మరమ్మతులు చేసి వదిలేస్తున్నారని విమర్శించారు. దీంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే భవనాన్ని పరిశీలించి అవసరమైన నిధులు మంజూరు చేసి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అవసరమైతే కొత్త భవనం నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



# చారిత్రక నిర్మాణాలపై కుహనా వాదనలను తిప్పికొట్టండి

**- ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ**





**మందస, జులై 9(వార్త):** చారిత్రక పట్టణమైన మందసలోని గోపాలసాగరం దరిన పురాతన మండపం కూల్చివేతకు వ్యతిరేకంగా పట్టణంలో ప్రజలు, ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ నాయకులు తీవ్ర నిరసనలను వ్యక్త పరుస్తున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన చారిత్రక ద్రోహాన్ని సమర్థించుకుంటూ కొద్దిమంది చేస్తున్న అబద్ధపు ప్రచారాలను 'ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ'తీవ్రంగా ఖండించింది. గోపాలసాగరం సుందరీకరణకు తామెవరూ వ్యతిరేకించడం లేదనే విషయాన్ని ముందుగా అర్థం చేసుకోవాలని కమిటీ స్పష్టం చేసింది. ప్రధానంగా ఆ ప్రాచీన మండపాన్ని ధ్వంసం చేస్తున్న సమయంలో స్థానికులు వద్దని మొత్తుకుంటున్నప్పటికీ, కాంట్రాక్టర్ పెడచెవిన పెట్టడమే కాకుండా అత్యంత బాధ్యతారాహిత్యంగా సమాధానాలు ఇచ్చాడని కమిటీ మండిపడింది. గత పది రోజులుగా పట్టణ ప్రజలు ఆందోళనతో అధికారులను సంప్రదించినప్పటికీ, వారు ఏమాత్రం లెక్కచేయకుండా జైన విగ్రహం పాదాల వరకు జేసీబీలతో తవ్వకాలు జరిపారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మరో కీలకమైన అంశం ఏంటంటే, ప్రముఖ శివాలయానికి వెళ్లే ముఖద్వారం దారి కూడా ఇదే కావడం వలన ఆ దారిని పూర్తిగా తవ్వేయడం వల్ల శివాలయ భక్తులకు కూడా తీవ్ర అసౌకర్యం కలిగింది. దీనిపై శివాలయం కమిటీ వారు సదరు కాంట్రాక్టర్ ను నిలదీయగా "ఈ గట్టుమీద అసలు శివాలయం ఎందుకు నిర్మించారు? అంటూ కాంట్రాక్టర్ ఎదురు ప్రశ్నించడంతో భక్తులలో తీవ్ర ఆందోళన రేగి నిరసనలకు దారితీసింది. జేసీబీ ప్రకంపనల ధాటికి ఆ పురాతన గోడ, దానికి ఆనించి ఉన్న జైనమతానికి చెందిన వృషభనాధుడి విగ్రహం కూలిపోయి ఉంటే దానికి ఎవరు బాధ్యత వహించేవారని ప్రజలు ప్రశ్నించారు. ఇప్పుడు పూర్తిగా ధ్వంసమైపోయిన ఆ మండపానికి అసలు ఎవరు బాధ్యత వహిస్తారని, ఒకవేళ ఆ విగ్రహం కూలిపోయి ఉంటే కూడా ఇప్పుడు మండపం విషయంలో చెబుతున్నట్టే బాధ్యతారహిత వ్యాఖ్యానాలు చేసేవారని స్థానిక ప్రజలు ఆగ్రహంతో కాంట్రాక్టర్ తో వాగ్వాదానికి దిగి పనులను అడ్డుకున్నారు. వందేళ్లకు పైబడిన పురాతన చారిత్రక కట్టడాలు, పురావస్తు ప్రాధాన్యత ఉన్న ప్రదేశాలు, శిల్పాలు లేదా విగ్రహాల వంటి అవశేషాలను జాతీయ సంపదగా గుర్తించి, వాటిని నాశనం కాకుండా రక్షించడం కోసం భారత ప్రభుత్వం 'పురాతత్వ ప్రదేశాలు, అవశేషాల చట్టం, 1958' (ది అన్సియెంట్ మెనుమెంట్స్ అండ్ ఆర్కియాలజీ సైట్ అండ్ రిమయిన్స్ యాక్ట్ 1958) తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం పురాతన కట్టడాల పరిసర ప్రాంతాల్లో (నియంత్రిత ప్రాంతాలలో) ఎలాంటి అనధికార తవ్వకాలు లేదా నిర్మాణాలు చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధం. చట్టం ఇంత స్పష్టంగా చెబుతున్నా... "అది శిథిలమై నిరుపయోగంగా ఉంది, ధ్వంసం చేస్తే తప్పేమిటి?" అని, "అందులో శిలాశాసనాలు ఏమీ లేవు కదా" అంటూ ఎద్దేవాతో ఎదురు ప్రశ్నలు వేస్తున్న వారి అజ్ఞానాన్ని ఏమనాలని కమిటీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కొద్దిమంది సాంప్రదాయవాదులు కూడా ఇందులో జోక్యం చేసుకొని జరిగిందేదో జరిగింది, ఇకనైనా అభివృద్ధికి సహకరించాలి అనే వాదనను ముందుకు తెస్తుండటం గమనార్హం. దీనికి తోడు, తామేదో అభివృద్ధిని అడ్డుకుంటున్నట్టు సదరు కాంట్రాక్టర్ తన అనుకూల పత్రికలలో ప్రకటనలు కూడా ఇప్పించుకుంటున్నాడు. ఈ విధంగా మాట్లాడడం అంటే సమస్యను పూర్తిగా పక్కదారి పట్టించడమే అవుతుందని కమిటీ పేర్కొంది. ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటు చేయడానికి తగినంత ఖాళీ స్థలం మండపానికి అభిముఖంగా అందుబాటులో ఉన్నప్పటికీ, కావాలనే ఈ పురాతన మండపాన్ని ఎటువంటి అనుమతులు లేకుండా కూల్చివేయడం ఖచ్చితంగా దురుద్దేశపూరితమేనని కమిటి పేర్కొంది. ఈ అంశంపై పోరాటం ముగించి, అభివృద్ధికి సహకరించాలని కోరడం ఏమాత్రం సమంజసం కాదు. కాంట్రాక్టర్ వారి వెనుకున్న వ్యక్తుల దురుద్దేశాన్ని కప్పిపుచ్చడమే అవుతుంది ఇది ఒకరకంగా నేరస్థులను కాపాడటమే అవుతుందని నిరసనకారులు వాపోతున్నారు. ప్రజల అభ్యర్థనలను తోసిపుచ్చి, చట్టాన్ని కూడా లెక్కచేయకుండా మండపాన్ని ధ్వంసం చేశారు. అలా ధ్వంసం చేసిన మండపాన్ని తిరిగి పునర్నిర్మించకుండా పోరాటాన్ని ఆపేయమనడం అంటే... ఈ చారిత్రక దుర్ఘటనను ఉదాసీనంగా విడిచిపెట్టమని చెప్పడమే అవుతుంది. మండపాన్ని పునర్నిర్మించడమనే అంశాన్ని దాటవేస్తూ, 'అభివృద్ధి' మంత్రం వల్లిస్తున్న వారి అంతరంగాల వెనుక ఉన్న చీకటి కోణాలను అర్థం చేసుకోవాలని చరిత్ర ప్రేమికులకు, ప్రజలకు ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్లు మామిడి కోదండరావు, నిరంజన బెహరా పిలుపునిచ్చారు.




## యువ శాస్త్రవేత్తకు ఘన సత్కారం

**- మహేశ్వరం భానుచందర్‌ను అభినందించిన వైఎస్సార్సీపీ నేత ధర్మాన కృష్ణ చైతన్య**

**- నరసన్నపేటకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని ప్రశంస**



**నరసన్నపేట, జులై 9(వార్త):** సూక్ష్మ విండ్ టర్బైన్‌ను రూపొందించి వరల్డ్ రికార్డు సాధించిన యువ శాస్త్రవేత్త మహేశ్వరం భానుచందర్‌ను వైఎస్సార్సీపీ నేత, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య ఘనంగా సత్కరించారు. బుధవారం సాయంత్రం నరసన్నపేట పట్టణంలోని సంతోషిమాత ఆలయం సమీపంలో ఉన్న భానుచందర్ నివాసానికి వెళ్లిన ధర్మాన కృష్ణ చైతన్య, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రతిభ కనబరిచి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నరసన్నపేట ప్రాంతం నుంచి ఇలాంటి యువ శాస్త్రవేత్త ఎదిగి వరల్డ్ రికార్డు సాధించడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. యువత తమ ప్రతిభను వినూత్న ఆవిష్కరణల ద్వారా నిరూపించుకుని దేశానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భానుచందర్ సాధించిన ఈ ఘనతతో నరసన్నపేటకు ప్రత్యేక గుర్తింపు లభించిందని, భవిష్యత్తులో మరిన్ని శాస్త్రీయ విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు, అభిమానులు భానుచందర్‌ను అభినందించి ఆయన భవిష్యత్తు మరింత విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు.

## వంశధార కాలువ గట్లపై పెరుగుతున్న ఆక్రమణలు

**- సిమెంట్ వ్యాపారుల అక్రమ నిర్మాణాలతో దెబ్బతింటున్న రక్షణ గట్లు**

**- ఆక్రమణలు తొలగించి కాలువలను పరిరక్షించాలని రైతుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, జులై 9(వార్త):** వంశధార కాలువలకు రక్షణగా ప్రభుత్వం లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కాలువ గట్లు ప్రస్తుతం అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేట పరిసర ప్రాంతాల్లో పలువురు సిమెంట్ వ్యాపారులు కాలువ గట్లను ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో కాలువల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, కాలువ గట్లపై సిమెంట్ ఉత్పత్తుల తయారీ కేంద్రాలు, నిర్మాణ సామగ్రి నిల్వలు ఏర్పాటు చేయడంతో పాటు చిప్స్, ఇసుక వంటి వస్తువులను భారీగా నిల్వ ఉంచుతున్నారు. దీంతో గట్లు దెబ్బతింటుండటమే కాకుండా కాలువ నిర్వహణ పనులకు కూడా ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. అక్రమ నిర్మాణాలు, నిల్వల కారణంగా కాలువ గట్లపై కనీసం నడిచేంత స్థలం కూడా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. కాలువలను పర్యవేక్షించి రక్షించాల్సిన సంబంధిత అధికారులు ఈ వ్యవహారాన్ని పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులపై వినిపిస్తున్న ఆరోపణలకు అధికారిక ధృవీకరణ లేదు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువ గట్లపై ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించి, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని రైతులు, స్థానిక ప్రజలు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. కాలువ గట్లను యథాతథ స్థితికి తీసుకువచ్చి సాగునీటి వ్యవస్థకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## పాపం పింపిడియా మార్గం..!

**-అధ్వాన్నంగా రెండు మండలాలను కలిపే రోడ్డు**

**- రూ.73.13లక్షల రహదారి రాళ్లపాలు**

**- విద్య, వైద్య, వ్యాపారాలకు ఆటంకం**

**మందస, జులై 9(వార్త):** అదో రెండు మండలాలను కలిపే రహదారి.. ప్రధానంగా మందస మండలంలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తోంది.. మందస మండలంలోని సుమారు ఏడెనిమిది గ్రామాలు, సోంపేట మండలంలోని ఐదారు గ్రామాలకు దారి అందిస్తోంది. ఎంతో ముఖ్యమైన ఈ రహదారి ప్రస్తుతం అధ్వాన్నంగా ఉంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. ప్రమాదకంగా మారింది. ముఖ్యంగా పింపిడియా అనే గ్రామానికి తలనొప్పిగా మారింది. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని సిద్ధిగాం-బుడార్సింగి రహదారిలో పింపిడియా అనే గ్రామం ఉంది. దీనికి ఆనుకుని పలు చిన్న గ్రామాలున్నాయి. అదేవిధంగా పింపిడియా నుంచి మహేంద్రతనయ మీదుగా సోంపేట మండలంలోని పలు గ్రామాలను ఈ రహదారి కలుపుతోంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రహదారిని 2020వ సంవత్సరంలో రూ.73.13లక్షలతో నిర్మించడానికి గత పాలకులు శంకుస్థాపన చేశారు. నత్తనడకగా సాగిన ఈ రహదరి పనులు అర్థాంతరంగా నిలిపిపోయాయి. పనులు నిలిచిపోవడానికి బలీయమైన కారణాలు ఉన్నట్టు ప్రచారం జరిగింది. ఏదేమైనా.. రహదారిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ప్రస్తుతం ఈ రహదారి రాళ్లు తేలి.. అధ్వాన్నంగా మారింది. నడవలేని స్థితికి చేరుకుంది. పాదాచారుల నడవలేకపోతుండగా.. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిని బాగు చేయాలని ప్రజలు ఎన్నిసార్లు కోరినా, పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజలు విద్య, వైద్య, వ్యాపార పరంగా ఇదే దారిలో ప్రయాణిస్తుంటారు. ప్రమాదాలకు గురవుతుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పింపిడియా రహదారిని బాగు చేసి, ప్రజలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.






## పిఆర్ఎంఇఎ మండల అధ్యక్షులుగా మన్మథరావు

**పలాస, జులై 9(వార్త):** పలాస పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల అధ్యక్షునిగా కొర్ల మన్మథరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఎపి పిఆర్ఎంఇఎ మండల శాఖ ఎన్నికలు గురువారం నిర్వహించారు. కార్యదర్శిగా ఎం.టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా టి.గోపాలకృష్ణ, కోశాధికారిగా వరప్రసాద్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పి.నాగేశ్వరరావు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.నారాయణరావు, కార్యదర్శి కె.నరసింహామూర్తి, పలాస ఎఒ ఎ.అనురాధ వ్యవహరించారు.



## విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి



**పలాస, జులై 9 (వార్త):** పలాస సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. యజ్ఞేశ్వరరావు ఒక పకటనలో తెలిపారు. 33/11 కేవీ పలాస సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామకృష్ణపురం ఫీడర్ లో ఏబీ స్విచ్‌ల ఏర్పాటు, నిర్వహణ (మెయింటెనెన్స్) పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని పలాస విద్యుత్ ఏ ఈ నాగభూషణరావు తెలిపారు. దీని వలన క్రింది ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, మొగలిపాడు, కొండి వీధ, ఎంఆర్ఓ కార్యాలయ పరిసర ప్రాంతం, ఆర్డీఓ కార్యాలయ పరిసర ప్రాంతం, శాసనం ప్రాంతం, మున్సిపల్ కార్యాలయ ప్రాంతం, పోస్టాఫీస్ ప్రాంతం, వాసుదేవపేట, జీజే కళాశాల ప్రాంతం, దత్త పీఠం ప్రాంతం, ఓల్డ్ కోర్టు ప్రాంతం, డేకూర కొండ ప్రాంతం అందువల్ల పై ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి, విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## ఆర్థిక ప్రొఫైలింగ్ పై అధికారులకు శిక్షణ

పలాస, జులై 9 (వార్త): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీడీపీ /జీఎండీపీ సామర్థ్య నిర్మాణ కార్య క్రమంలో భాగంగా పలాస ఎంపీడీవో కార్యాలయంలో అసెంబ్లీ నియోజక వర్గ ఆర్థిక ప్రొఫైలింగ్ పై శిక్షణ కార్యక్ర మం నిర్వహించారు. పలాస నియోజక వర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కన్వీనర్, పలాస ఎంపిడిఓ కె. వసంత కుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. స్వర్ణాంధ్ర ఏ20 47 లక్ష్యాల సాధనకు సమగ్ర ఆర్థిక ప్రొఫైలింగ్ కీలకమని ఆయన పేర్కొన్నారు. పాహలే /ఇండియన్ ఫౌండేషన్ జోనల్ కోఆర్డినేటర్ స్టాన్లీజేమ్స్, వారి టీమ్ వారు శాల వారీ డేటా సేకరణ, విశ్లేషణ, నివేదికల తయారీ, సమన్వయంపై అధికాలకు శిక్షణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలాస నియోజకవర్గంలోని వివిధ శాల అధికారులు పాల్గొన్నారు.



## భవాని అక్రమాలపై జర్నలిస్టుకు నోటీసులు

**- పోలీసుల అత్యుత్సాహంపై జర్నలిస్టు సంఘాల ఆగ్రహం**

**- జిల్లా ఏఎస్పీకి, ఐటిఐ కన్వీనర్ కు వాస్తవాలు వివరించిన సంఘాల ప్రతినిధులు**

**సోంపేట, జులై 9(వార్త):** నేటి విద్యార్థులే రేపటి నవ సమాజ నిర్మాణ కర్తలు అన్న సంగతి అందరికీ తెలిసిన విషయం. అటువంటి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థ నాణ్యత ప్రమాణాలను, విద్యార్థులు చదువులను గాలికి వదిలేసి వారి నుంచి అక్రమంగా భారీ మొత్తాలను ఫీజుల రూపంలో వసూలు చేస్తూ కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఐటిఐ కళాశాలలో అనేక అవకతవకలకు పాల్పడుతున్న వ్యవహారాన్ని వెలికి తీసి కథనాలు ప్రచురించిన ఓ జర్నలిస్టుకు సదరు యాజమాన్యం పోలీసుల ద్వారా నోటీసులు ఇప్పించడాన్ని జిల్లా జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఆగ్రహిస్తున్నాయి. భారత రాజ్యాంగం ద్వారా ఫోర్త్ ఎస్టేట్ గా గుర్తించబడిన జర్నలిస్టులకు అక్రమాలకు సంబంధించిన వార్తలు రాసే స్వేచ్ఛను హరిస్తున్న పోలీసుల తీరును జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. కంచిలిలో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై నోటీసులు అందుకున్న సీనియర్ జర్నలిస్ట్, ఉద్దానం పత్రిక ఎడిటర్ భావన శ్రీకాంత్ తో పాటు పలువురు జర్నలిస్టులు కలసి గురువారం శ్రీకాకుళంలో జిల్లా ఏఎస్పీని అలాగే జిల్లా ఐటిఐ ల కన్వీనర్ను కలసి వాస్తవాలను వివరించారు. కంచిలిలో గల భవాని ఐటిఐ లో జరుగుతున్న అక్రమాలు గూర్చి విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదుల మేరకు ఆధారాలతో వార్తలు రాయడం పట్ల యాజమాన్యం జర్నలిస్టుపై ఫిర్యాదు చేయడం ఆ వెంటనే కంచిలి ఎస్సై పారినాయుడు జర్నలిస్టు శ్రీకాంత్ కు నోటీసు జారీ చేయడం పట్ల సర్వత్రా చర్చనీయాంశం అయింది. ఇటువంటి పోలీస్ చర్యను జర్నలిస్టులు తీవ్రంగా ఖండిస్తున్నారు. చట్టాన్ని అడ్డం పెట్టుకొని సమాజంలో జర్నలిస్టులకు స్వేచ్ఛ లేకుండా అక్రమాలు,అవినీతికి సంబంధించిన వార్తలు రాసే అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడమే దీని ఉద్దేశం అంటూ పోలీసుల తీరును విమర్శిస్తున్నారు. జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించడాన్ని జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న విద్యాసంస్థ పై వెంటనే విచారణ జరిపించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఈ విషయంలో ఎస్సై పారినాయుడు తీరు పట్ల స్థానికుల నుంచి కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546